
# యోగ్యత




**ఫ్రిజ్** నీళ్లతో మొహం కడుక్కుంది. డికాక్షన్ కాఫీ రెండు కప్పులు తక్కువ కాకుండా ఎక్కించింది. ఫుల్‌స్పీడ్‌లో తిరుగుతున్న సీలింగు ఫ్యాను కింద పావు గంటై దొర్లుతోంది. అయినా పార్వతమ్మ అలసట తగ్గలేదు.

ఆ రిక్షావాడితో అంతకుముందు ఆవిడ పడ్డ ఘర్షణ నుంచి ఓ పట్టాన మామూలు స్థితికి రాలేకపోతోంది. ఒంటరిగా నిస్సహాయురాలిగా ఉంటే మాత్రం ఇంతటి దోపిడి ఎక్కడైనా ఉంటుందా!

తనిల్లు ఎక్కడో స్పష్టంగా చెప్పింది. దార్లో మార్కెట్లో సామాన్లు కొనుక్కుంటాననీ, అవి రిక్షాలో తీసుకురావలసి ఉంటుందనీ, అన్నీ కలుపుకునే పన్నెండు రూపాయలకి మాట్లాడుకుంది. బేరం కుదుర్చుకున్నప్పుడు బాగానే ఉన్నాడు. మంచి బియ్యం కనబడితే అరబస్తా పడేయించుకుంది. అక్కణ్నుంచి ఆరంభమైంది అల్లరి, పేచీ. సామాన్లంటే ఏ కూరలో పప్పు దినుసులో అనుకున్నాట్ట. 'ఇలా అయితే మీరిచ్చిన కిరాయి కిట్టదండి' అంటూ దారి పొడుగునా ఒకటే సణుగుడు. దార్లో ఎరిగిన మనిషి కనబడే పలకరిస్తే, కాస్సేపు రిక్షా ఆపించి దాని మంచీ చెడ్డా కనుక్కోడం మరో

మహాపరాధం. వాడి నస భరించలేక గురుద్వార్ మళుపు తిరిగే సమయంలో ఎరక్కపోయి నోరు జారేసింది. 'నిన్నగాక మొన్న ఇంతకు రెట్టింపు సామాన్లు అంత అప్పూ ఎక్కించడమే కాక మా మేడమీది వాటాకి చేర్చి, పదిరూపాయలిస్తే కళ్లకద్దుకుంటూ పోయాడు. నీలాంటివాడే! ఇంత అల్లరి ఎరగం సుమా, అన్నీ ముందు మాట్లాడుకున్నాక! కావాలంటే అడగాలి గాని ఇలా నానాగోలా పెట్టడం ఏం బావులేద్సుమా!

అంతే, ఆ మలుపులో రిక్షా ఆపేశాడు. 'ఈ కొండమీదకి మీతోపాటు మీతోపాటు ఇవన్నీ చేర్చడం కాక, అక్కణ్ణుంచి, పై వాటాలోకి మొయ్యాలా? తల్లీ మీకూ మీ బేరానికి నమస్కారం.

ఓ రెండు నేనే తగ్గించుకుంటాను. ఓ పదరూపాయల నోటు నా మొహాన తగలేసి సరుకుతోపాటు మీరూ దిగిపోతే మరో నాలుగు రోజులు బతుకుతాను.' అనే ధోరణిలో దోపిడీ. అక్కడున్న రిక్షా వాళ్ళూ పనీ పాటూ లేనివాళ్లూ తనచుట్టూ చేరి ఇకఇకలూ పకపకలూ! మొత్తం ఇరవై ఎనిమిదికి మాటాడుకుని తనూ సరుకూ క్షేమంగా మేడమీదికి చేరేసరికి యజ్ఞం చేసినంత పనైంది. 'వీళ్లతో పడలేం! అయినా డబ్బుకి చూసుకోక ఇలాంటప్పుడు ఆటో కట్టించుకోవాలి!' అని ఎదురింటివాటా ఆవిడ సలహా ఒకటీ, కిందనుంచి ఆ ఆరబస్తాబియ్యం పైకి మొయ్యడానికి తను సిద్ధంగా ఉన్నట్టు!

అలా ఆలోచిస్తూ అటూ ఇటూ పొర్లుతున్న పార్వతమ్మకి గుండెల్లో ఏదో అసహజంగా ఉన్నట్టు తోచి జాకెట్‌లోపల పెట్టుకున్న పర్సు పైకితీసి, లేచి కూచుంది. పర్సు జిప్ బయటికి లాగి అందులో ఉన్న డిమాండ్ డ్రాఫ్ట్ ఇవతలకి తీసింది. మొగుడికి తెలియకుండా, పెళ్ళి నాటి తన గాజులు తణకాపెట్టి, పన్నెండు వేలు అల్లుడిపేర తీసుకున్న డ్రాఫ్టు అది. ఈ సాహసకృత్యం సఫలీకృతం చేద్దామనే తనీరోజు న్యూకాలనీలో ఉన్న కూతురింటికి వెళ్లి వస్తున్నది. విలువైన ఆ కాగితం ఎక్కడపోతుందో అని ఎంతో జాగ్రత్తగా గుండెలకద్దుకుని దాచుకుంది. ఈ దిక్కుమాలిన రిక్షా గోలలో పడి అంత ముఖ్యమైన విషయం మరచిపోవడం తనకే ఎంతో ఆశ్చర్యమనిపిస్తున్నది.

కూతురు కామాక్షి మాటలు ఆమెకి గుర్తొచ్చాయి.

'నీకు తెలుసుకదా అమ్మా, మీ అల్లుడిగారికి ఎంతమానుషమో! రెండు లక్షల కట్నంతో వచ్చే మేనకోడల్ని కాదని కేవలం ఏభైవేలకే నన్ను కట్టుకున్ననాడే ఆయన సౌశీల్యం అందరికీ అర్థమై ఉంటుంది. నా ఒంటిన ఈ నలభై కాసుల బంగారం, ఇల్లు నిండిన ఈ ఫర్నిచరూ నాన్న ఎంత బతిమాలితే ఆయన ఇక్కడ చేరనిచ్చారో నీకు తెలీంది కాదు కదా! ఆ సిటీ బస్సులు మారలేక, అంతటి అప్పు, ఆ సైకిలు తొక్కలేకా అవస్థపడుతుంటే నేనే చూడలేక ఆయన చెవిని పడకుండా నీకు ఫోను చేశాను కాని, అమ్మో పై వాళ్ల పైసా పుచ్చుకుంటే ఆయన ప్రాణం పోదూ! ఇన్నీ తెలిసుండి ఆయన పేర డిమాండ్ డ్రాఫ్టు తెస్తావా, నా కాపరం నిలబడాలనేనా! ఇన్ని చేసిందానివి ఎలాగోలా క్యాష్ తెచ్చి నాకివ్వలేవా? మీకు మాత్రం మరెవరున్నారని, ఎవరికి పెట్టుకోవాలని? పెద్ద ఉద్యోగమైన అన్నయ్యకి పెద్ద సంబంధం చేసి ఇలాంటి ఇంకో అన్ని అక్కణ్ణుంచి రాబట్టుకోమనే కద, మన సంప్రదాయం మనకి రుజువు చేస్తున్నది!'

'తన చేతుల్తో తనుపెంచి పెద్ద చేసి తన కళ్ళ ముందు పెరిగిన పిల్ల ఇన్ని ఆరిందా కబుర్లు ఎప్పుడు నేర్చిందే!' అనే ఆశ్చర్యం నుండి తనింకా తేరుకోకుండానే కామాక్షి మరో బాంబు పేల్చింది.

'నువ్వు వేరే చెప్పక్కర్లేదు. నాన్నకి తెలీకుండా ఈ మనీ నువ్వు ఎడ్జస్టు చేశావని తెలుస్తూనే ఉంది. ఏం చేస్తాం! ఈ మగాళ్ళందరికీ ఒక్కొక్కరికి ఒక్కొక్క రకం తిక్క. ఆయనకి ఇవ్వకూడదని తిక్క. ఈయనకి పుచ్చుకోకూడదని తిక్క. ఆడది ఓ వారధి అన్నారు. మనం చూస్తూ చూస్తూ ఊరుకోలేం గదా! ఎందుకు చెబుతున్నానంటే నువ్వు తెచ్చింది స్కూటరు కొనడానికి చాలదు. ఈసారి మరో నాలుగు కలిపి, గుర్తుందిగా, నగదే తీసుకురా, ఏ లాటరీలోనో కొట్టుకొచ్చానని మంచి సమయం చూసి మీ అల్లుడిగార్ని మభ్యపెట్టి స్కూటరు కొనిపిస్తాను. నాలుగురోజులాగి ఫోను చేస్తాను. సర్దుబాటు విషయం చెబుతావుగా?'

ఎవడో రిక్షా బెల్లు వాయించుకుంటూ రోడ్డుమీద పోతూంటే ఆ చప్పుడు చెవినపడి పార్వతమ్మ మనస్సు త్రుళ్ళిపడినట్టయింది. ఇవతలి వరండాలోకి వచ్చి అక్కడి పడక్కుర్చీలో జారపడి కళ్లు మూసుకుంది. కూతురి ఆ సంభాషణకీ, రిక్షావాడితో తన సంఘర్షణకీ ఏదో ముడిఉన్నట్టు ఆమెకి అనిపించింది.

రిక్షాలో బైఠాయించిన తనకే ఆ మండుటెండలో చెమటతో ఒళ్ళంతా తడిసి ముద్దయిపోయింది. ఇంతటి బరువుని ఇలాంటి అప్పులో దేవుడామని పైకి లాగడమేకాక, మళ్ళీ మంచినీళ్లనా అడక్కుండా అరబస్తాబియ్యాన్ని పైకి చేర్చాడు. ఎర్రగా కందిపోయి ఏరులా ప్రవహిస్తున్న వాడి మొహం ఎందుచేతో తన ముందు నుంచి కదలడం లేదు. పన్నెండుకి బేరమాడిన మాట నిజమే. తను ఖర్చుపెట్టిన వాడి అదనపు సమయమూ, చేర్చిన అదనపు భారమూ మరో పది వేసుకున్నా వాడు ఎక్స్ట్రాగా తీసుకున్నది ఎనిమిది రూపాయలు మాత్రమే! ఈ శ్రమజీవి కష్టానికి ఈ మాత్రం ఖర్చు పెట్టేశాననేనా తను ఇంతసేపూ ఇంతగా తలబద్దలు కొట్టుకున్నది!

అల్లుడు ఒకటోరకం డబ్బుమనిషని తను ఎప్పుడో పోల్చుకుంది. ఆ మోసం ఆ చిద్విలాసం, అదెంతటిదంటే తను గుర్తుపట్టలేనంతగా తన కూతుర్నే రెండేళ్ళు దాటకుండానే మార్చేసింది. అల్లుడుగారు తానుగా ఇస్తానంటాడేగాని పైసా అడగడు. అంతా అమ్మాయిద్వారానే అడిగిస్తాడు. అదైనా అడిగినట్టు తెలీకుండా అడగగలిగిన జాణ అయిపోయింది!

చాకిరీకీ సౌఖ్యానికీ కన్యనిస్తారు. కట్నాలు చదివిస్తారు. కానుకలు సమర్పిస్తున్నారు. అందరికీ తెలిసిన ఇలాంటి అనేక రకాల దోపిడీలని అత్యంత సన్నిహితులైనా అదేమని నిలదీయకపోగా అదే సహజమన్నట్టు సరిపెట్టుకోగలిగిన కుసంస్కారులం మనం. ఇంతటి సాంఘిక కాలుష్యం పెంచి పోషిస్తున్న మనకి, కడుపు మండిన కార్మికుడి కక్కుర్తి ఎత్తిచూపే యోగ్యత ఎక్కడిది!

పార్వతమ్మ వంచిన తల ఎత్తలేదు. అది అరక్షణంపాటే కావొచ్చు. అరక్షణం కూడా అనంతంలో ఓ భాగమే.

(స్వాతి సపరివార పత్రిక)